## క్లుప్తంగా

### ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

చైతన్యపురి: చైతన్యపురి డివిజన్ పరిధిలోని భవానీనగర్‌లో యశోద ఆసుపత్రి మలక్‌పేట సౌజన్యంతో భవానీ మహిళా మండలి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత ఆరోగ్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా బీపీ, షుగర్, తదితర రుగ్మతలపై రోగులకు పరీక్షలు నిర్వహించి, అవసరమైన సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, కాలనీ సభ్యులు మాధురి, శ్రీనివాస్ చారి, వెంకట్ రెడ్డి, చందు, మురళి, రాజు పాల్గొన్నారు.

### మోదీ సభతో కార్యకర్తల్లో నూతనోత్తేజం



సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మోదీ సభకు తరలిన నాయకులు

సైదాబాద్: వరంగల్‌లో నిర్వహించిన ప్రధాని నరేంద్రమోదీ సభతో బీజేపీ నాయకులు, కార్యకర్తల్లో నూతనోత్తేజం నెలకొందని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన ఆధ్వర్యంలో భాగ్యనగర్ జిల్లా పరిధిలోని నాలుగు నియోజకవర్గాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు వరంగల్‌కు తరలి వెళ్లారు. సైదాబాద్ నుంచి వెళ్లిన నాయకుల వాహనాల శ్రేణిని ఆయన జెండా ఊపి ప్రారంభించారు.

**కొప్పుల ఆధ్వర్యంలో...**

మన్సురాబాద్: వరంగల్‌లో జరిగిన ప్రధాని నరేంద్రమోదీ బహిరంగ సభకు మన్సురాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు.

### ప్రధాన సమస్యల పరిష్కారానికి చర్యలు

మన్సురాబాద్: నియోజకవర్గంలోని ప్రధాన సమస్యల పరిష్కారం కోసం ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నానని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం మన్సురాబాద్ డివిజన్ పరిధిలోని సరస్వతినగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలలో ముందుగా డ్రైనేజీ, రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తున్నామని, విడతల వారీగా అన్ని సమస్యలు పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, మాజీ డివిజన్ అధ్యక్షుడు జగదీష్‌యాదవ్, యువ నాయకుడు జక్కిడి రఘువీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### బ్యాంకు రుణాలపై అవగాహన కల్పిస్తాం

మలక్‌పేట: సామాజిక సేవ చేయడంతో పాటు బ్యాంకులు అందించే వివిధ రుణాలపై పేద, మధ్య తరగతి ప్రజలకు అవగాహన కల్పిస్తామని బిక్కి సంస్థ ప్రతినిధి ఎ.కృష్ణమూర్తి తెలిపారు. మూసారంబాగ్ డివిజన్ ఎస్‌బీఐ ఆఫీసర్స్ కాలనీలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, నూతన వ్యాపారాలకు లాభసాటి ఆలోచనలతో ముందుకొస్తే బ్యాంకుల ద్వారా రుణాల రూపంలో పెట్టుబడి సాయం, ప్రోత్సాహకాలు అందించే విధంగా కృషి చేస్తామన్నారు. సమావేశంలో శాలిని, బిక్కి సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

### వైభవంగా మహంకాళి ఆలయ వార్షికోత్సవం

చంచల్‌గూడ: కుర్మగూడ బస్తీలోని మహంకాళి (మూడు గుళ్ల) ఆలయ 18వ వార్షికోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకురాలు శ్రీదేవి ఆధ్వర్యంలో దంపతులు సుదర్శన, చండీ హోమం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సహదేవ్‌యాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కమిటీ సభ్యులు బర్ల శ్రవణ్‌కుమార్, అనిల్, గోపీనాథ్, కిషన్, సూర్య, నర్సింహ, సూర్యం, వినయ్‌కుమార్, దాసరి ప్రమోద్, నాగారాజు తదితరులు పాల్గొన్నారు.

### బస్సు ఢీకొని మహిళ మృతి

నాగోల్: ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. యాచారం మండలం గడ్డం మల్లయ్యగూడెం గ్రామానికి చెందిన నర్రె మైసమ్మ(70) కొత్తపేట సమీపంలో కూరగాయలు విక్రయించేది. శనివారం సాయంత్రం సాగర్ రింగ్‌రోడ్ నుంచి తన ఇంటికి వెళ్లేందుకు రోడ్డు క్రాస్ చేస్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. కుమారుడు పర్వతాలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# రోడ్లు అధ్వానం.. రాకపోకలు ఆగమాగం



గుంతలు పడ్డ వీవీ నగర్ ప్రధాన రహదారి



అధ్వానంగా తయారైన కమలానగర్ నుంచి వీవీనగర్ కాలనీలోకి వెళ్లే రహదారి

- గుంతలు పడి, కంకర తేలిన కాలనీల్లోని రహదారులు
- అభివృద్ధి పనుల పేరిట అడ్డగోలుగా తవ్వకాలు
- ఆపై మరమ్మతు చేపట్టని అధికారులు

చైతన్యపురి: గడ్డిఅన్నారం డివిజన్‌లోని కాలనీల్లో ఎక్కడ చూసినా రోడ్లు గుంతలు పడి, కంకర తేలి దర్శనమిస్తున్నాయి. అధ్వానంగా తయారైన ఈ రోడ్లపై రాకపోకలు సాగించేందుకు పాదచారులే కాకుండా వాహనదారులు ఆందోళనకు గురవుతున్నారు.

◆ వాటర్, డ్రైనేజీ వంటి పైప్‌లైన్లు, ఇతర అభివృద్ధి పనుల కోసమని కాలనీల్లోని రోడ్లను తవ్వుతున్న అధికారులు పనులు పూర్తయ్యాక వాటికి ప్యాచ్ వర్క్‌లు చేయకుండా వదిలేస్తుండటంతో రహదారులు పూర్తిగా ధ్వంసమవుతున్నాయని కాలనీల ప్రజలు చెప్తున్నారు.

◆ గడ్డిఅన్నారం డివిజన్‌లోని కమలానగర్ నుంచి వీవీనగర్, శ్రీనగర్ కాలనీ, కృష్ణానగర్ కాలనీల నుంచి వీవీ నగర్‌కు వెళ్లే రహదారులు గుంతలు పడి అధ్వానంగా తయారై ప్రజలు ఇబ్బందులు పడుతున్నా.. జీహెచ్‌ఎంసీ అధికారులు గానీ, ప్రజా ప్రతినిధులు గానీ పట్టించుకోవటం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

◆ స్థానిక కార్పొరేటర్, అధికారులు వెంటనే స్పందించి కాలనీల్లోని రోడ్లకు మరమ్మతు చేయించాలని కోరుతున్నారు.

**అన్ని రోడ్లదీ అదే పరిస్థితి**



డివిజన్‌లోని ఏ కాలనీలో చూసినా రోడ్ల పరిస్థితి ఘోరంగా ఉంది. సీసీ రోడ్లు అన్నీ గుంతలు పడ్డాయి. నాసిరకంగా రోడ్లు వేయడంతో కంకర తేలి రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. డ్రైనేజీ, తాగునీరు పైపులు వేసేందుకు తవ్విన రహదారులు ప్యాచ్ వర్క్‌లకు నోచుకోక పోవటంతో గుంతలు పడి ప్రమాదకరంగా తయారయ్యాయి. అంతేకాకుండా రోడ్ల మధ్యలో ఉన్న మ్యాన్‌హోళ్ల కవర్లు కుంగిపోయి ప్రమాదాలు జరుగున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేయించాలి.

–ఆర్.రాజమోహన్‌రాజు, చైతన్యపురి

### భక్తులకు అన్నప్రసాద వితరణ



ఆలయంలో అన్న ప్రసాదం వడ్డిస్తున్న నిర్వాహకులు

మలక్‌పేట: మూసారంబాగ్ దుర్గా రాజరాజేశ్వరి త్రిశక్తి ఆలయంలో శాకంబరి ఉత్సవాలను రెండు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శాకంబరి అలంకరణలో అమ్మవారిని కొలిచి మొక్కులు తీర్చుకున్నారు. దుర్గారాజరాజేశ్వరి దేవికి అలంకరణ చేసిన రకరకాల కూరగాయలు, ఆకుకూరలతో వండిన అన్నప్రసాదాన్ని శనివారం భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చైర్మన్ జూకంటి యాదగిరి, ప్రధాన కార్యదర్శి కాటపల్లి రాజేశ్వర్‌రావు, కోశాధికారి విష్ణువర్ధన్ యాదవ్, ఉపాధ్యక్షులు మావురం నర్సింహ, విశాల్, సభ్యులు జంగం గౌడ్, కృష్ణగౌడ్, మహిపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజు యాదవ్, వెంకట్‌రెడ్డి, ప్రధాన అర్చకులు దేశపతి నాగరాజు శర్మ పాల్గొన్నారు.

### వికలాంగుల సమస్యలను పరిష్కరించండి

చాదర్‌ఘాట్: వికలాంగుల కార్యక్రమాల కోసం జీహెచ్‌ఎంసీ బడ్జెట్‌లో 5 శాతం నిధులు కేటాయించాలని వికలాంగుల సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు వారు జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జీహెచ్‌ఎంసీలో ఖాళీగా ఉన్న దాదాపు 150పై వికలాంగుల రిజర్వుడు పోస్టులను భర్తీ చేయాలన్నారు. డబుల్ బెడ్రూమ్ ఇళ్లలో 5శాతం వికలాంగులకు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో నల్గొండ శ్రీను, గుత్తికొండ కిరణ్, బండ జగన్, సుధాకర్, మహేష్, శివ పాల్గొన్నారు.



జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ను కలిసిన వికలాంగుల సంఘాల నాయకులు

### అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలి



హస్తినాపురంలో పర్యటిస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్

హస్తినాపురం: డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలని, ప్రజల భాగస్వామ్యం మూలంగానే పనుల్లో నాణ్యత ప్రమాణాలు మెరుగుపడతాయని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్ అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని శ్రీరామనగర్‌కాలనీలో కాలనీ వాసులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, డివిజన్ పరిధిలో రోజురోజుకూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు కనీస వసతులు కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటానన్నారు. డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న డ్రైనేజీ సమస్యల శాశ్వత పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటానని ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరికలు: ఎమ్మెల్యే



బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చంపాపేట: బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్ పార్టీలోకి చేరేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి చంపాపేట డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు నల్లా రఘుమారెడ్డి ఆధ్వర్యంలో రామచిలుకబస్తీకి చెందిన పలువురు యువతీ యువకులు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సుధీర్ రెడ్డి మాట్లాడుతూ...రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత తాగు, సాగునీటి సరఫరాతో పాటు విద్యుత్, వ్యవసాయ, పారిశ్రామిక, ఉద్యోగ, విద్య వంటి పలు రంగాల్లో అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలను అమలు చేసి ఇతర రాష్ట్రాలకు ఆదర్శవంతంగా తీర్చిదిద్దిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు మరోమారు బీఆర్‌ఎస్‌కే అధికార పగ్గాలు అందించేందుకు ఉత్సాహం చూపుతున్నారన్నారు. కార్యక్రమంలో డివిజన్ పార్టీ అధ్యక్షుడు ముదువు రాజిరెడ్డి, నాయకులు ఓరుగంటి వెంకటేష్‌గౌడ్, గోపాల్ ముదిరాజ్, రోజారెడ్డి, ప్రభాకర్, విద్యాసాగర్, కట్టా వెంకటేష్, తిరుమలేష్, శేఖర్‌రెడ్డి, నిశీకాంత్‌రెడ్డి, గౌతమ్‌రెడ్డి, పార్టీలో చేరిన వారిలో మోహన్, గణేష్, లక్ష్మణ్, శంకర్, సాయిబాబా పాల్గొన్నారు.

### రెండు రోజుల్లో చలాన్లు కట్టకుంటే నిర్మాణాలు కూల్చేస్తాం

**ఉప్పల్ తహసీల్దార్ గౌతమ్ కుమార్**



జీఓ 59 కింద దరఖాస్తు చేసుకున్న వారితో మాట్లాడుతున్న తహసీల్దార్

నాగోలు: జీఓ 59 కింద దరఖాస్తు చేసుకున్న వారు రెండు రోజుల్లో చలాన్లు కట్టకుంటే నిర్మాణాలు పూర్తిగా తొలిగిస్తామని ఉప్పల్ తహసీల్దార్ కె. గౌతమ్‌కుమార్ హెచ్చరించారు. శనివారం ఉప్పల్ మండల పరిధిలోని నాగోల్, బండ్లగూడ గ్రామాల్లో పర్యటించి పలు అక్రమ నిర్మాణాలను పాక్షికంగా కూల్చివేయించారు. జీఓ 59 కింద దర ఖాస్తు చేసుకున్న అక్రమ నిర్మాణదారులు ప్రభుత్వం పేర్కొన్న ఫీజు చెల్లించాల్సి ఉన్నా కట్టడంలేదన్నారు. నోటీసులు ఇచ్చినా స్పందించడం లేకపోవడంతో ప్రభుత్వ స్థలాల్లోని అక్రమ నిర్మాణాలు కూల్చివేస్తున్నామన్నారు. రెండు రోజులు చలాన్లు చెల్లించకపోతే నిర్మాణాలను కూల్చివేస్తామన్నారు. హెచ్చరించారు. కార్యక్రమంలో సర్వేయర్ ప్రశాంత్, జూనియర్ అసిస్టెంట్ స్వాతి, వీఆర్‌ఏలు నాగలక్ష్మి, స్వామి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

### పిల్లలను జాగ్రత్తగా చూసుకోమని వ్యక్తి అదృశ్యం



సయ్యద్ మజర్

చంచల్‌గూడ: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన శనివారం మాదన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... రెయిన్‌బజార్ నివాసి సయ్యద్ మజర్ (30) గత శనివారం రాత్రి చాలా ఆందోళనతో ఇంటికి వచ్చాడు. పిల్లలను జాగ్రత్త చూసుకోమని భార్య సయ్యద్ సాహెరాకు చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లి వారం రోజులైనా తిరిగి రాలేదు. అన్ని చోట్ల వెతికినా ఫలితం లేకుండా పోవడంతో భార్య సాహెరా మాదన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం



మలక్‌పేట: ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం దిల్‌సుఖ్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ విద్యార్థి దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. రాజీవ్‌చౌక్ నుంచి కమలా ఆసుపత్రి మీదుగా దిల్ సుఖ్‌నగర్ బస్టాండ్ వరకు ర్యాలీ కొనసాగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ మాట్లాడుతూ.. ఐదుగురితో మొదలైన విద్యార్థి పరిషత్ నేడు 45 లక్షలకు పైగా సభ్యులతో ప్రపంచంలోనే అతి పెద్ద విద్యార్థి సంఘంగా అవతరించిందన్నారు. 75 ఏళ్లుగా విద్యార్థుల సమస్యలపై ఏబీవీపీ నిరంతరం పోరాటం చేస్తున్నదని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు కుంచాల సాయిరామ్, కుమార్, అభిషేక్, శ్రీరామ్, నీరజ్, రికీ, తదితరులు పాల్గొన్నారు.

### ఫ్రెషర్స్ డే వేడుకలు



విద్యార్థులతో పాఠశాల చైర్మన్ విఠల్‌రెడ్డి తదితరులు

వనస్థలిపురం: డివిజన్ పరిధిలోని శ్రీనివాసపురం కాలనీలోని నాగార్జున మాంటిస్సోరి ఐఐటీ ఒలంపియాడ్ పాఠశాలలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యాసంస్థల చైర్మన్ గుమ్మికొండ విఠల్‌రెడ్డి, అకడమిక్ డీన్ ఎస్.రాజశేఖర్, సీఏఓ కవి.శేషారావు, వైస్ ప్రిన్సిపాల్ ఎ.లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

సైదాబాద్: విద్యార్థి దశ నుంచే చిన్నారులు నాయకత్వ లక్షణాలు పెంచుకొని దేశసేవకు కృషి చేయాలని ప్రముఖ సామాజిక కార్యకర్త దోసపాటి రాము అన్నారు. శనివారం చంపాపేటలోని శ్రీత్రివేణి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఇన్‌వెస్టిట్యూర్ సెర్మనీకి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. స్కూల్ క్యాబినెట్ సభ్యులుగా ఎన్నికైన విద్యార్థులను ఆయన పాఠశాల డైరెక్టర్ కె.గోవర్ధన్‌రెడ్డితో కలిసి సన్మానించారు. బ్యాడ్జీలు అందజేసి వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. స్కూల్ క్యాబినెట్ సభ్యులుగా ఎన్నికైన విద్యార్థులు క్రమశిక్షణతో ఇతరులకు ఆదర్శంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శారద, వైస్ ప్రిన్సిపాల్ సిద్దిరాం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కొత్తపేటలో వైఎస్ఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఎల్బీనగర్ ఇన్‌చార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి తదితరులు

# జనహృదయ నేతకు ఘన నివాళి



చిత్రలేఅవుట్‌లో .. కాంగ్రెస్ నేత దేప భాస్కర్‌రెడ్డి తదితరులు

ఎల్బీనగర్/మలక్‌పేట జోన్ బృందం: దివంగత మహానేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను ఎల్బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల పరిధిలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్, వైఎస్ఆర్‌టీపీ నాయకులతో పాటు వైఎస్ఆర్ అభిమానులు ఆయన చిత్రపటాలకు, విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కేక్‌లు కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాభివృద్ధికి విశేష కృషి చేయడంతో పాటు ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన సంక్షేమ సారథి రాజశేఖరరెడ్డి అని కొనియాడారు. రైతులకు ఎన్నో సబ్సిడీలు ఇవ్వడంతో పాటు ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూపకల్పన చేసిన రైతు బాంధవుడని అన్నారు. పేదల పిల్లలు కూడా ఉన్నత చదువులు అభ్యసించాలని ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను అమలోకి తెచ్చారని, పేదలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు ఆరోగ్యశ్రీని ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో వైఎస్ఆర్ చెరగని ముద్ర వేసుకున్నారని అన్నారు.



కర్మన్‌ఘాట్ చౌరస్తాలో...చంపాపేట వైఎస్ఆర్ అభిమాన సంఘ అధ్యక్షుడు ఆలె వెంకటరెడ్డి



ఎల్బీనగర్ వైఎస్ఆర్ చౌరస్తాలో... కాంగ్రెస్ ఇన్‌చార్జ్ జక్కిడి ప్రభాకర్‌రెడ్డి



ఎల్బీనగర్‌లో కేక్‌కట్ చేస్తున్న వైఎస్ఆర్‌టీపీ నేత మామిడి రాంచందర్ తదితరులు



ఓల్డ్‌మలక్‌పేటలో వైఎస్ఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీపీసీసీ సెక్రటరీ బొల్లు కిషన్

### అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం

మన్సురాబాద్: రానున్న బోనాల పండుగ సందర్భంగా భక్తులకు, కాలనీవాసులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ ప్రాంగణంలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని మన్సురాబాద్ పోచమ్మ ఆలయ కమిటీ చైర్మన్ కొప్పుల విఠల్‌రెడ్డి వెల్లడించారు. శనివారం జరిగిన ఆలయ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ, ఈనెల 16న జరుగనున్న బోనాల ఉత్సవాలను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు. ఆలయ కమిటీ కార్యదర్శి ఉపేందర్‌రెడ్డి, కోశాధికారి రాజేందర్‌గౌడ్ పాల్గొన్నారు.



### నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

లింగోజిగూడ: ఎల్బీనగర్ నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశానని, ఇంకొంచెం అభివృద్ధి జరగాల్సి ఉందని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. లింగోజిగూడ డివిజన్‌లోని పలు కాలనీల సంక్షేమ సంఘాల నాయకులతో శనివారం ఎమ్మెల్యే ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కాలనీవాసులు తమ కాలనీల్లోని డ్రైనేజీ, తాగునీరు రోడ్లు, ట్రాఫిక్, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, వారంతపు సంతను ప్రధాన రోడ్డుపై నుంచి తొలగించి ప్రభుత్వ ఆసుపత్రి పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో ఏర్పాటు చేయిస్తామన్నారు. ఎల్బీనగర్ మెట్రో స్టేషన్ వద్ద ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. సర్వీస్ రోడ్డును వన్‌వే చేయడంతో పాటు ఎల్బీనగర్ నుంచి నాగోలు వెళ్లే రహదారిలో కొంతమేర ఫుట్‌పాత్‌ను తొలగించి రోడ్డును వెడల్పు చేయిస్తామన్నారు. అన్ని కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాసరావు, ట్రాఫిక్ సీఐలు నరసింగ్‌రావు, నాగమల్లు, మెట్రో ఎస్ఈ సాయప్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు వరప్రసాద్‌రెడ్డి, నాయకులు తిలక్‌రావు, శ్రావణ్‌కుమార్, శ్రీధర్‌గౌడ్, లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

### వయోవృద్ధుల సంక్షేమానికి కృషి

నాగోలు: సీనియర్ సిటిజన్ల కోసం ఏర్పాటు చేసిన డే కేర్ సెంటర్లను మరింత బలోపేతం చేస్తామని జీహెచ్‌ఎంసీ హయత్‌నగర్ సర్కిల్-3 డిప్యూటీ కమిషనర్, ఆసరా అధ్యక్షుడు మారుతి దివాకర్ అన్నారు. శనివారం నాగోలులో కో ఆపరేటివ్ బ్యాంక్ కాలనీ సంక్షేమ సంఘం భవనంలో ఆసరా హయత్‌నగర్ సర్కిల్ 4 ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న మారుతి దివాకర్ మాట్లాడుతూ, సర్కిల్ పరిధిలోని డే కేర్ సెంటర్‌లో మౌలిక సదుపాల కోసం నిధులు మంజూరు చేస్తామన్నారు. వయోవృద్ధుల సమాన హక్కులు- సామాజిక గౌవరం కోసం ఆసరా పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ హయత్‌నగర్ సర్కిల్ అధికారులు బలరాం, నాగేశ్వరావు, శుభాకర్‌రావు, నారాయణ రావు, ఆసరా హయత్‌నగర్ సర్కిల్ సంఘం ఉపాధ్యక్షుడు యాదిరెడ్డి, కార్యదర్శి హరినాథ్‌బాబు, సీనియర్ సిటిజన్ల ఫోరం కో-ఆపరేటివ్ బ్యాంక్ కాలనీ అధ్యక్షుడు అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### భవనం పైనుంచి పడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి



యోగేష్ (ఫైల్)

సైదాబాద్: నిద్ర మత్తులో రెయిలింగ్ లేని భవనంపై నుంచి పడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందిన ఘటన సైదాబాద్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ... సైదాబాద్ కాలనీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు వనం జగదీశ్వరరావు కుమారుడు వనం యోగేష్ (32) సాఫ్ట్‌వేర్ కంపెనీలో పని చేస్తున్నాడు. గురువారం రాత్రి విధులు ముగించుకొని తాము నివసించే అపార్ట్‌మెంట్‌కు ఆలస్యంగా చేరుకున్నాడు. అపార్ట్‌మెంట్‌కు గేట్ వేసి ఉండటంతో సమీపంలోని బంధువుల ఇంటిపై పడుకున్నాడు. నిద్రమత్తులో రెయిలింగ్ లేని ఆ భవనం పైనుంచి కింద పడ్డాడు. తలకు తీవ్రగాయాలైన అతడిని శుక్రవారం ఉదయం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.